క్లుప్తంగా

జాబ్‌మేళాలో 29 మంది ఎంపిక

నిడదవోలు: స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దివిస్ లేబరేటరీస్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 29 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఒ.జ్యోతి తెలిపారు. కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్ సమీపంలోని బల్క్ డ్రగ్ పరిశ్రమలో ప్రొడక్షన్ విభాగంలో 'ట్రైనీ సూపర్‌వైజర్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్'గా పని చేసేందుకు బీఎస్సీ కెమిస్ట్రీ, బీఫార్మసీ, బీటెక్ (కెమికల్), ఎమ్మెస్సీ(ఆర్గానిక్ కెమిస్ట్రీ/ఎనలిటికల్ కెమిస్ట్రీ), ఎం.ఫార్మసీ అర్హత గత 50 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరగా 29 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిలో ఆరుగురు ఈ కళాశాల పూర్వపు విద్యార్థులు కావడం గమనార్హం. జేకేసీ కన్వీనర్, బి.సాజన్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

కొవ్వూరు: స్థానిక ఏబీఎస్ అండ్ పీఆర్ఆర్ కళాశాలలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎన్వీ సుబ్బారావు తెలిపారు. జీఎస్టీ దినోత్సవం సందర్భంగా జీఎస్టీ అధికారులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. 18 ఏళ్లు నిండి ఆరోగ్యవంతంగా ఉన్న వాళ్లు ఈ రక్తదానంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

గ్రామాల అభివృద్ధికి దాతల సహకారం అవసరం

గోపాలపురం: గ్రామాల అభివృద్ధికి దాతల సహకారం అవసరమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. వెదుళ్ళకుంటలో మంగళవారం బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిర్మించిన షెడ్డును ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను పాటించి ప్రతి ఒక్కరికి ఆయన ఫలాలు అందేలా చూస్తామని అన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో కాకుండా దాతలు గ్రామాల అభివృద్ధిలో పాలు పంచుకోవాలని సూచించారు. ముందుగా గోపాలపురం ఉప్పరగూడెంలో ఇటీవల నిర్మించిన కల్వర్టు, సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు.

అమర వీరులకు నివాళులు



సమిశ్రగూడెంలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నిడదవోలు రూరల్: దళితులపై అగ్రవర్ణాల దాడులను నిరసిస్తూ మండలంలోని సమిశ్రగూడెం బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద కుల నిర్మూలన పోరాట సమితి(కేఎన్‌పీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. చుండూరులో 33 ఏళ్ల క్రితం అశువులు బాసిన 8 మంది దళిత మృతవీరులకు కేఎన్‌పీఎస్ నాయకులు నివాళులర్పించారు. దళితులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేఎన్‌పీఎస్ నాయకులు తానేటి రవీంద్ర, ముప్పిడి లాజర్, అరుణ్‌కుమార్, రాజు, సాలోమాన్, షఫీ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: చుండూరులో మారణహోమం జరిగి నేటికీ 33 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిడదవోలు చర్చిపేటలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అమరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తూరుగోపు ముత్యాలరావు, ఉసురుమర్తి ప్రభాకర్, నల్లా దుర్గాప్రసాద్, లెనిన్, అనిల్ ప్రమోద్ పాల్గొన్నారు.

గ్యాప్ పద్ధతిలో సాగు చేస్తే సర్టిఫికెట్



కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జేడీ మాధవరావు

నల్లజర్ల: గ్యాప్ (గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్)పద్ధతిలో పండించిన పంటలకు ఇండ్ గ్యాప్ ఆర్గానిక్ సర్టిఫికెట్లు జారీ చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు వెల్లడించారు. మంగళవారం నల్లజర్ల సహకార సంఘ సమావేశ మందిరంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో మాధవరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్ గ్యాప్ పొలంబడి పద్ధతులు ఆచరించి ప్రపంచ దేశాలకు వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలన్నారు. 14 వారాల పాటు వ్యవసాయాధికారులు సూచించిన మేలైన వ్యవసాయ పద్ధతులు ఆచరిస్తూ, సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యం, నేలసంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, సాగు చేసే మనుష్యుల భద్రత, రక్షణతో పంటలు పండించి ఇండ్‌గ్యాప్ సర్టిఫికెట్ పొందితే 129 దేశాలకు మన ఉత్పత్తులను ఎగుమతి చేసుకోవచ్చని తెలిపారు. దీనికి దూబచర్లలోని గోదావరి రైతు ఉత్పత్తిదారుల సంఘంతో ఒప్పందం చేసుకోవాలన్నారు. వారు ఆంధ్రప్రదేశ్ సేంద్రియ ఉత్పత్తుల సర్టిఫికేషన్ అథారిటీతో ఒప్పందం చేసుకుంటారన్నారు. పంట చివరి దశలో ధాన్యం నమూనాలు సేకరించి ఎటువంటి పురుగు మందుల అవశేషాలు లేవని నిర్ధారించి సర్టిఫికెట్ జారీ చేస్తే వాటిని ఇతర దేశాలకు పంపించే అవకాశం ఉంటుందన్నారు. గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాల రైతులు గోదావరి రైతు ఉత్పత్తిదారుల సంఘంతో అగ్రిమెంట్ చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కొవ్వూరు ఏడీఏ పి.చంద్రశేఖర్, నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం మండలవ్యవసాయధికారులు కమల్‌రాజ్, కె.విజయ, బి.రాజారావు, ఎఫ్.పి.ఓ సీఈఓ భానుప్రతాప్, ఏఈఓ పుష్పలత, వీపీఏ పి.దుర్గాసురేష్, జాన్‌పాల్, రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఫైర్‌స్టేషన్ నిర్మాణం జరిగేనా?

- దేవరపల్లిలో అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి స్థల సేకరణ
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.2.74 కోట్లు మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన అధికారులు
- ఇంకా ప్రారంభంకాని పనులు
- అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు



అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి దేవరపల్లిలో అధికారులు సేకరించిన స్థలం



అగ్నిమాపక వాహనం (ఫైల్)

దేవరపల్లి: చిరకాల కోరిక అగ్నిమాపక కేంద్రం నిర్మాణం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రతి ఎన్నికల్లోను ప్రజాప్రతినిధులు తాము అధికారంలోకి వస్తే నియోజకవర్గంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీలు ఇవ్వడం, పదవులు చేపట్టిన తర్వాత మరచిపోవడం పరిపాటిగా మారింది. దీంతో నియోజకవర్గ ప్రజలు అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుపై ఆశలు వదులుకున్నారు. అయితే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు దేవరపల్లిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నాలు చేపట్టారు. దేవరపల్లిలో స్థలం కూడా సేకరించారు. అనంతరం తలారి వెంకట్రావు కొవ్వూరు ఇన్‌చార్జిగా వెళ్లారు. గోపాలపురం ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్న తానేటి వనిత అగ్నిమాపక కేంద్రం నిర్మాణంపై దృష్టిపెట్టారు. ఎట్టకేలకు ఈ ఏడాది మార్చి 15న దేవరపల్లిలో అగ్నిమాపక కేంద్రం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు రోజుల అనంతరం ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో శంకుస్థాపన కార్యక్రమం వాయిదా పడింది.

రూ.2.74 కోట్లు మంజూరు

అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి రూ.2.74,33,000 మంజూరు చేస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 18 మంది సిబ్బందిని కొత్తగా నియమించడంతోపాటు అగ్నిమాపక అధికారి, లీడింగ్ ఫైర్‌మెన్లు ముగ్గురు, ఫైర్‌మెన్లు 13 మంది, స్వీపర్ పోస్టు ఒకటి, మొత్తం 18 మందిని కొత్తగా నియమించనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సిబ్బంది నియామకానికి రూ.85.05 లక్షలు, ఫైర్ స్టేషన్ నిర్మాణానికి రూ.1,89,28,000 మంజూరు చేశారు. దీంతో నియోజకవర్గ ప్రజల చిరాకల స్వప్నం నెరవేరుతుందని ఆనందపడ్డారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పాటు అధికారంలోకి రావడంతో అగ్నిమాపక కేంద్రం నిర్మాణం మరుగున పడుతుందేమోనని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వాహనాలు వచ్చేలోపు..

గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లిలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయడంతో గోపాలపురం, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటి వరకు దేవరపల్లి మండలానికి కొవ్వూరు, నిడదవోలు నుంచి, గోపాలపురం మండలానికి జంగారెడ్డిగూడెం, నల్లజర్ల మండలానికి తాడేపల్లిగూడెం, ద్వారకాతిరుమల మండలానికి భీమడోలు అగ్నిమాపక కేంద్రం నుంచి వాహనాలు వస్తున్నాయి. దాదాపు 20 నుంచి 30 కిలో మీటర్ల దూరంలో అగ్నిమాపక కేంద్రం ఉండడంతో అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో తీవ్రంగా నష్టం జరుగుతోంది. నియోజకవర్గంలో ఎక్కువగా పొగాకు బ్యారన్లు ఉండడం వల్ల క్యూరింగ్ సమయంలో అగ్నిప్రమాదాలు సంభవించి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సుమారు రూ.5 నుంచి రూ.10 లక్షలు రైతు నష్టపోతున్నారు. ఎక్కువగా పొగాకు బ్యారన్లలో అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి.

పొగాకు రైతులకు నష్టం



అగ్నిప్రమాదాల్లో పొగాకు రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. వేసవిలో పొగాకు క్యూరింగ్‌కు జరడం వల్ల బ్యారన్‌లో ఆకులు రాలి ప్రమాదాలు జరుగుతున్నాయి. అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉండక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎటు చూసినా 30 నుంచి 50 కిలో మీటర్ల దూరం నుంచి వాహనం రావాల్సి వస్తోంది. వాహనం వచ్చే సమయానికి బూడిద మిగులుతోంది. మెట్ట ప్రాంత ప్రజల చికాల కోరిక అగ్నిమాపక కేంద్రం. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు దృష్టికి తీసుకువెళ్లి అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తాం.

– కరుటూరి శ్రీనివాస్, అధ్యక్షుడు, పొగాకు రైతు సంఘం, సంగాయగూడెం

వేసవిలో ఎక్కువ ప్రమాదాలు



దేవరపల్లిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఎక్కడా అగ్నిమాపక కేంద్రం లేదు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు అగ్నిమాపక వాహనం అందుబాటులో లేక ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. వేసవిలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజాప్రతినిధులు అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు కృషి చేయాలి.

– అనిశెట్టి సూర్యచంద్రం, రైతు, యాదవోలు

సమాజాభివృద్ధిలో పోలీస్ పాత్ర కీలకం



దేవరపల్లి ఎస్సై శ్రీహరిరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

దేవరపల్లి: సమాజ అభివృద్ధిలో పోలీస్ పాత్ర చాలా కీలకమని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. స్థానిక ఎస్సై కె.శ్రీహరిరావు కొవ్వూరు రూరల్ స్టేషన్‌కు బదిలీ అయిన సందర్భంగా స్థానిక సీఐ బాలసురేష్ ఆధ్వర్యంలో మంగళవారం స్టేషన్ సిబ్బంది ఏర్పాటు చేసిన వీడ్కోలు అభినందన సభలో ఎమ్మెల్యే వెంకట్రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శ్రీహరిరావు ఉద్యోగంపై అంకిత భావంతో పనిచేశారని ఆయన అన్నారు. సీఐ బాల సురేష్ మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో శ్రీహరిరావు అనేక విజయాలు సాధించినట్టు ఆయన తెలిపారు. ఎస్సై శ్రీహరిరావును ఎమ్మెల్యే వెంకట్రాజు, సీఐ బాల సురేష్, గోపాలపురం ఎస్సై కె.సతీష్‌కుమార్, దేవరపల్లి, కొవ్వూరు, నల్లజర్ల, గోపాలపురం, పోలీస్ స్టేషన్ల సిబ్బంది, ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

కోతకు గురైన కాలువలకు రక్షణ చర్యలు

- డివిజన్‌లో రూ.25లక్షల వ్యయంతో 12 పనులు
- సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

కొవ్వూరు: భారీ వర్షాల కారణంగా కోతకు గురైన కాలువలు, చెరువులకు రక్షణ చర్యలు చేపడుతున్నామని, డివిజన్‌లో రూ.25 లక్షలు వెచ్చించి పన్నెండు పనులు చేపట్టినట్టు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ప్రకటించారు. మంగళవారం తహసీల్దార్లు, నీటి పారుదల శాఖ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముందుగా అత్యవసరమైన పనులు గుర్తించి వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పనులు పరిశీలించాలన్నారు. ప్రధానంగా కొవ్వాడ, ఎర్రకాలువ, ఇతర వాగులు, డ్రయిన్లు, చెరువు గట్లు 12 చోట్ల కోతకు గురైనట్లు గుర్తించామన్నారు. వీటిలో యర్నగూడెం, జగన్నాథపురం గ్రామాల్లో రెండేసి పనులు, మద్దూరులంక, కాల్దారి, సూర్యారావు పాలెం, గంగోలు, సాగిపాడు, యర్నగూడెం, త్యాజంపూడి, కోరుమామిడిలో పనులు కొనసాగుతున్నాయన్నారు. యర్నగూడెం, మద్దూరులంక గ్రామాల్లో పనులు ఇప్పటికే పూర్తి చేసినట్లు తెలిపారు. పనులకు ఇసుక అవసరమైతే తహసీల్దార్ల ద్వారా సమకూర్చుకోవాలని సూచించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్పంచ్ రామశ్రీనివాస్



గోపవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

నల్లజర్ల: అమ్మపాలే బిడ్డకు శ్రేయస్కరమని జగన్నాథపురం సర్పంచ్ చెల్లారి రామశ్రీనివాస్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా దూబచర్ల సెక్టార్ పరిధిలోని జగన్నాథపురం 7, 8 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ అనే పదంలోనే అనురాగం, ఆప్యాయత ఉన్నాయని తల్లిపాలతోనే బిడ్డకు తొలి టీకా అందుతుందన్నారు. శారీరక ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వార్డుమెంబరు కొనకళ్ళ నాగేశ్వరావు, బాతు అశోక్‌కుమార్, కార్యకర్తలు కె.సత్యవతి, ఈ.బేబి, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు. తెలికిచెర్ల, తూర్పు, పడమర చోడవరం, పోతవరంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి.

గోపాలపురం: తల్లిపాలు అమృతంతో సమానమని బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టాలని సీడీపీఓ కె.పద్మావతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం వివిధ గ్రామాలలో ర్యాలీ నిర్వహించి తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ,ఆశ కార్యకర్తలు తల్లులు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

చాగల్లు: తల్లిపాల వారోత్సవాలులో భాగంగా మంగళవారం చాగల్లులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలు 67, 68, 69, 70 కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రాజెక్ట్ లీడర్ మాణిక్యమ్మ తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. సచివాలయం కార్యదర్శి సుప్రజ, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భవతులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

పంట నష్టం నమోదుపై సోషల్ ఆడిట్



గౌరీపట్నంలో రైతుల జాబితాను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

దేవరపల్లి: భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటల నమోదు కార్యక్రమం పూర్తయిందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. పంట నష్టపోయిన రైతుల జాబితాను గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. మంగళవారం గౌరీపట్నం గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన రైతుల జాబితాను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాదవరావు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాలువలు, వాగులు, చెరువులు పొంగి ఉధృతంగా ప్రవహించడం వల్ల దిగువనున్న పంట చేలు ముంపునకు గురైనట్టు ఆయన తెలిపారు. క్షేత్ర స్థాయిలో పంటను పరిశీలించి దెబ్బతిన్న పంటలను నమోదు చేశామన్నారు.దేవరపల్లి మండలంలో 375 మంది రైతులకు చెందిన 565 హెక్టార్లు, గోపాలపురం మండలంలో 373 మంది రైతులకు చెందిన 401 హెక్టార్లు, నల్లజర్ల మండలంలో 178 మంది రైతులకు చెందిన 225 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్టు ఆయన తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు పంట నష్ట రైతు జాబితాను రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించినట్టు ఆయన చెప్పారు. రైతులు జాబితాను పరిశీలించి పంట నష్టం నమోదు కాని రైతులు, సర్వే నంబర్లు తేడా ఉన్న రైతులు సరి చేయించుకోవచ్చునని ఆయన తెలిపారు. పంట నష్టం నమోదుపై సోషల్ ఆడిట్ జరుగుతుందని ఆయన తెలిపారు. లబ్ధిదారుల తుది జాబితా 8వ తేదీన ప్రభుత్వానికి అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి కె.విజయ్, రైతులు పాల్గొన్నారు.

నల్లజర్ల పీహెచ్‌సీ తనిఖీ అధికారుల బృందం



ఆశ కార్యకర్తలు, తల్లులతో మాట్లాడుతున్న తనిఖీ బృందం

నల్లజర్ల: స్థానిక పీహెచ్‌సీని వైద్యారోగ్యశాఖ అధికారుల బృందం తనిఖీ చేసింది. ఆసుపత్రిలో సేవలపై ఆరా తీసింది. వివిధ గ్రామాల ఏఎన్ఎంలు, ఆశలు, తల్లులతో బృందం సభ్యులు వైద్య సేవలు వివిధ అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ బృందంలో నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ కె.సంధ్యారాణి, జిల్లా డేటా మేనేజరు ఎస్.రామకృష్ణ, ఆశ డీసీఎం యం.అర్జునరావు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టరు గంగాధరరావు, సీహెచ్ఓ పలివెల ప్రసాద్, పీహెచ్ఎన్ రాధాకుమారి, హెచ్‌వీ అన్నమ్మ, పర్యవేక్షకులు సత్యానారాయణ, వైద్య, ఉద్యోగుల సంఘ నాయకులు జీవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన ఉపాధ్యాయుడు



లారీ కిందకు వెళ్లిన బైక్

తాళ్లపూడి: గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఎడ్ల సత్యనారాయణ మంగళవారం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఉదయం దొమ్మేరులోని ఉన్నత పాఠశాలకు విధులకు హాజరయ్యేందుకు మోటారుసైకిల్‌పై వెళుతుండగా బల్లిపాడు చిడిపి మధ్యలో ఉన్న మలుపు వద్ద అదుపు తప్పి పడిపోయారు. మోటారుసైకిల్ ఎదురుగా వస్తున్న లారీ కిందకు వెళ్లిపోయింది. దీంతో కాలికి, తలకు బలమైన గాయాలయ్యాయి. ఆయన్ని రాజమండ్రిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు.

పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

- మాదిగల కార్యాచరణ సదస్సులో వక్తల వెల్లడి
- తొగుమ్మిలో యువత సంబరాలు



ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన కార్యకర్తల ఫొటోలు ప్రదర్శిస్తున్న నాయకులు

కొవ్వూరు: ఎస్సీ వర్గీకరణ 30ఏళ్ల పోరాటం తర్వాత సుప్రీం కోర్టు సానుకూలమైన తీర్పునివ్వడం సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని వక్తలు పేర్కొన్నారు. సోమవారం రాత్రి పట్టణంలో పరిమి రామారాయుడు, రత్తమ్మ కల్యాణ మండపంలో అరుంధతి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పెనుమాక జయరాజు అధ్యక్షతన మాదిగ భవిష్యత్ కార్యాచరణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి విజయరావు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమం ఒక చరిత్రని, దీన్ని భావితరాల భవిష్యత్తుకు ఉపయోగపడేలా మాదిగ పల్లెల్లో విద్యారంగ అభివృద్ధికి ప్రతి దండోరా కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని కోరారు. దళిత వర్గాల ఫెడరేషన్ అధ్యక్షుడు శెట్టి రాజు మాట్లాడుతూ వర్గీకరణ సాధనలో అసువులు బాసిన కుటుంబాలకు దండోరా ఉద్యమం అండగా నిలబడుతుందన్నారు. మాదిగ ఉద్యోగ సంఘ నాయకులు కొడమంచిలి సత్యనారాయణ, దున్న ప్రకాష్, ముప్పిడి ప్రకాశరావు, న్యాయవాదులు తిగిరిపల్లి రవికుమార్, మల్లిపూడి రవి కుమార్, గెల్లా కేశవ తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు సానుకూల తీర్పు నివ్వడంపై తొగుమ్మి గ్రామంలో మంగళవారం మాదిగ యువత సంబరాలు చేసుకున్నారు. ముందుగా గ్రామంలోని బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉద్యమనేత మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు పోరోజు జయరాజుని కార్యకర్తలు సత్కరించారు. ఎస్సీలను వర్గీకరణకి సానుకూలంగా నినాదాలు చేశారు.తక్షణమే వర్గీకరణ ప్రకారం రిజర్వేషన్ వర్తింపజేయాలని నినాదించారు.

కలెక్టర్ కార్యాలయంలో క్రాప్ సర్వేపై శిక్షణ

తాళ్లపూడి: కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని గ్రేడ్-1 వీఆర్వోలకు, జూనియర్ సహాయకులకు క్రాప్ సర్వే కార్యక్రమంపై తాళ్లపూడి మండల ఏఎస్వో జోడాల వెంకటేశ్వరరావు శిక్షణ ఇచ్చారు. గత మూడు రోజులుగా శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ శిక్షణలో పంటల నమోదు, దిగుబడి, వివరాల నమోదు, రైతుల ఎంపిక, పంటల వివరాలు, ప్రయోగం చేసే విధానం, వివిధ పంటలలో ఏయే ప్రయోగాలు చేయాలి, ఎలా లెక్కించాలి అనే విషయాలను వివరించారు. అనంతరం సిబ్బంది అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానం అందించారు. క్రాప్ సర్వే ఉపగణాంక అధికారి సూర్యనారాయణ, సహాయకులు శ్రీను, వీఆర్వో లు, జూనియర్ సహాయకులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



కొవ్వూరు రూరల్ సీఐ విజయబాబు



పెరవలి ఎస్సై అప్పారావు

కొవ్వూరు: స్థానిక రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.విజయబాబు మంగళ వారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సీఐ పి.శ్రీనివాసరావు వీఆర్‌కు వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన విజయబాబుకి రూరల్ ఎస్సై కె.సుధాకర్, సీఐ కార్యాలయ సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. పశివేదలకి చెందిన గారపాటి శ్రీనివాసరావు, గారపాటి రామచంద్రరావు తదితరులు విజయబాబుకు అభినందనలు తెలిపారు.

పెరవలి ఎస్సైగా అప్పారావు

పెరవలి: పెరవలి ఎస్సైగా పి.అప్పారావు మంగళవారం బాధ్యతలు భాద్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు నిడదవోలు ఎస్సైగా పనిచేసస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏజీఎస్ మూర్తి సోమవారం సాయంత్రం ఎస్పీ ఆఫీస్‌లో రిపోర్టు చేశారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు నిడదవోలు విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం సీహెచ్ పద్మ

నిడదవోలు: గణపవరంలో ఈ నెల నాలుగో తేదీన రిగిన జిల్లా స్థాయి యోగా పోటీలలో పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచారు. అండర్-14 బాలికల విభాగంలో తొమ్మిదో తరగతి చదువుతున్న కె.జ్యోతి తృతీయ స్థానం, అదే తరగతి విద్యార్థి డి.సత్యశ్రీ నాలుగో స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం చెరుకూరి పద్మ తెలియజేశారు. విశాఖపట్నంలో వచ్చే నెల 13, 14, 15 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలలో ఈ ఇద్దరూ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని వ్యాయామ ఉపాధ్యాయిని బి.శాంతి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు అభినందించారు.

వాటర్ ట్యాంకు శుభ్రం



వాటర్ ట్యాంకును శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

దేవరపల్లి: దేవరపల్లి-బుచ్చియపాలెం రోడ్డులోని పంచాయతీ బోరు వద్ద అపరిశుభ్రంగా ఉన్న వాటర్ ట్యాంకును సిబ్బంది శుభ్రం చేశారు. నీరు వృథాగా పోకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. వృథాగా పోతున్న తాగునీరు, నాచుపట్టిన వాటర్ ట్యాంకు అనే శీర్షికన 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి ఎన్.రవికిషోర్ సిబ్బందితో వెళ్లి ట్యాంకు వద్ద శుభ్రం చేయించారు. తాగునీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకున్నారు.